రాయకుదురు బాలికకు ఇండియన్ ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి - వీరవాసరం

ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు 2023కు సంబంధించి నిర్వహించిన దేశభక్తి పాటల ఆన్‌లైన్ పోటీల్లో రాయకుదురుకు చెందిన నార్కెడమిల్లి శ్రీశాశ్వత ప్రథమ బహుమతి పొందింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని కుటుంబ సభ్యులు మీడియాకు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో విజడమ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో శ్రీశాశ్వతకు ఈ అవార్డును అందజేశారు. ఈ అవార్డు ద్వారా దేశభక్తి, మన దేశ సంస్కృతీ సంప్రదాయాలను చిన్నతనం నుండి బాలల్లో అలవర్చడం తమ సంస్థ ముఖ్యోద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

శ్రీశాశ్వత అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

జెడ్‌పి ఛైర్మన్ పీఠం.. ఎవరికో..!



- ప్రస్తుత ఛైర్మన్ కవురు ఎంఎల్‌సి బరిలోకి
- ఖాళీ కానున్న జెడ్‌పి ఛైర్మన్ పదవి
- బిసి రిజర్వుడు కావడంతో ఆ జెడ్‌పిటిసిల్లో ఆశలు
- ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది బిసి జెడ్‌పిటిసిలు
- మేకా శేషుబాబుకు జెడ్‌పి ఛైర్మన్ ఇవ్వనున్నట్లు ప్రచారం
- ఖాళీ కానున్న యలమంచిలి నుంచి పోటీ చేయనున్నట్లు చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్మన్ పీఠం ఎవరికి దక్కనుందోననే చర్చ వైసిపిలో పెద్దఎత్తున సాగుతోంది. జెడ్‌పి ఛైర్మన్ పదవి బిసికి రిజర్వుడు కావడంతో ఆ సామాజిక తరగతికి చెందిన జెడ్‌పిటిసిలంతా ఈ పదవిని ఆశిస్తున్న పరిస్థితి నెలకొంది. ప్రస్తుతమున్న బిసి జెడ్‌పిటిసిల్లో ఎవరికైనా పదవి ఇస్తారా.. లేక వైసిపి అధిష్టానం కొత్త ఆలోచన చేస్తుందా అనే చర్చ సైతం నడుస్తోంది. ప్రస్తుత జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా వైసిపి ఎంపిక చేసింది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి పదవులు వైసిపి చేజిక్కించుకోనుండటంతో కవురుకు ఎంఎల్‌సి పదవి దాదాపు ఖాయమైనట్లే. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పీఠం ఖాళీ కానుంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవీ కాలం దాదాపు మూడున్నరేళ్ల వరకూ ఉంది. దీంతో ఈ పదవి కోసం బిసి జెడ్‌పిటిసిలు తమ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 జెడ్‌పిటిసి స్థానాలు ఉన్నాయి. దీనిలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న యలమంచిలి స్థానం మినహాయిస్తే భీమడోలు, భీమవరం, కాళ్ల, మొగల్తూరు, నరసాపురం, పాలకోడేరు, పెదపాడు, ఉండి, ఉంగుటూరు జెడ్‌పిటిసిలు బిసిలు. నాలుగుచోట్ల పురుష జెడ్‌పిటిసిలు ఉండగా, ఐదుచోట్ల బిసి మహిళలు ఉన్నారు. అంతా జెడ్‌పి ఛైర్మన్ పదవికి అర్హులే. పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీ పేరు ఛైర్‌పర్సన్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి పదవులు రెండు డెల్టా ప్రాంతానికి ఇవ్వడంతో మెట్ట ప్రాంతానికి జెడ్‌పి ఛైర్మన్ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. అయితే వైసిపి అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

తెరపైకి మేకా శేషుబాబు పేరు?

జెడ్‌పి ఛైర్మన్ పదవి ఖాళీ కానుండటంతో ఆ పదవి మాజీ జెడ్‌పి ఛైర్మన్, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబుకు ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ మేరకు అధిష్టానం మేకా శేషుబాబుకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎంఎల్‌సి కోటాలో పదవి కోసం మేకా శేషుబాబు చివరి వరకూ గట్టి ప్రయత్నం చేశారు. అయితే ఎంఎల్‌సి పదవిని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌కు ఇస్తున్నట్లు వైసిపి ప్రకటించింది. ఖాళీ కానున్న జెడ్‌పి ఛైర్మన్ పదవి శేషుబాబుకు ఇవ్వనున్నట్లు అధిష్టానం హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. కవురు శ్రీనివాస్ యలమంచిలి జెడ్‌పిటిసిగా ఉన్నారు. ఎంఎల్‌సిగా ఎన్నిక ప్రక్రియ పూర్తికాగానే కవురు జెడ్‌పిటిసి, జెడ్‌పి ఛైర్మన్ పదవులకు రాజీనామా చేయాల్సి ఉంటుంది. ఖాళీ అయిన యలమంచిలి జెడ్‌పిటిసి స్థానానికి ఎన్నికలు నిర్వహించి ఆస్థానం నుంచి మేకా శేషుబాబును పోటీ చేయించాలని వైసిపి అధిష్టానం ఆలోచన చేసినట్లు సమాచారం. అధికారం వైసిపికి గెలుపు సునాయాసమనే అభిప్రాయం ఉంది. జెడ్‌పిటిసిగా గెలిచిన తర్వాత శేషుబాబును జెడ్‌పి ఛైర్మన్ చేయాలని అధిష్టానం ఆలోచన చేసినట్లు చెబుతున్నారు. గతంలో మేకా శేషుబాబు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా గెలిచారు. అక్కడ నుంచి ఆయన వైసిపిలోనే ఉన్నారు. అప్పట్లో జెడ్‌పి ఛైర్మన్‌గా ఉన్న కారుమూరి ఎంఎల్‌ఏగా గెలుపొంది వెళ్లిపోయారు. దీంతో కొంతకాలం అప్పట్లో బిసి రిజర్వుడుగా ఉన్న జెడ్‌పి ఛైర్మన్ పదవి మేకా శేషుబాబును వరించింది. జెడ్‌పి ఛైర్మన్‌గా గతంలోనూ పని చేసిన అనుభవం శేషుబాబుకు ఉంది. దీంతో శేషుబాబుకే జెడ్‌పి ఛైర్మన్ పదవి ఇచ్చేందుకు వైసిపి అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తా

వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి రవీంద్రనాథ్

ప్రజాశక్తి - తణుకు

2024లో జరగబోయే సాధారణ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థి వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎం జగన్ తనపై ఎంతో నమ్మకంతో ఎంఎల్‌సి టిక్కెట్ ఇచ్చారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని వివరించారు. మండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. బుధవారం నామినేషన్ వేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎంపిపి రుద్ర ధనరాజు, వైసిపి పట్టణాధ్యక్షుడు మంగిన సూర్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వంకా రవీంద్రనాథ్

ఎంఎల్‌సి స్థానానికి నల్లి రాజేష్ నామినేషన్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి పాలకొల్లుకు చెందిన నల్లి రాజేష్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్ పత్రాలను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.అరుణ్ బాబుకు అందజేశారు. దీంతో ఇప్పటి వరకూ ఒక నామినేషన్ దాఖలు అయ్యినట్లయ్యింది.


నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నల్లి రాజేష్

బాలికపై అత్యాచార యత్నం

నిందితులకు స్థానికుల దేహశుద్ధి - పోలీసులకు అప్పగింత

ఆకివీడు: మూడో తరగతి చదువుతున్న బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం స్థానికంగా చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ రోడ్డులో నివశిస్తున్న బాలిక(8) మధ్యాహ్నం పాఠశాలకు వెళ్లడానికి రోడ్డుపైకి వచ్చింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో తోపుడు బండిపై సీజనల్ వ్యాపారం చేసుకునే ఇద్దరు యువకులు ఆ బాలికకు మాయమాటలు చెప్పి దగ్గరలో ఉన్న మార్కెట్ కమిటీకి చెందిన పాత భవనంలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడ్డారు. అయితే బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని ఇద్దరు యువకులను పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఆ బాలిక చదువుకుంటున్న పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

శ్రీశ్రీ రచనలు నేటి సమాజానికి మార్గదర్శకం

భీమవరం : మాట్లాడుతున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

శ్రీశ్రీ రచనలు, ఆలోచనలు, కవిత్వం నేటి సమాజానికి మార్గదర్శకంగా ఉంటాయని ప్రముఖ సాహితీవేత్త మంతెన సీతారాం అన్నారు. అంతర్జాతీయ భాషా దినోత్సవం, రెడ్‌బుక్ డే సందర్భంగా భీమవరం ఆలోచన వేదిక ఆధ్వర్యంలో స్థానిక క్విట్ ఇండియా స్థూపం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు చైతన్యప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ శ్రీశ్రీ సమాజంలో 'కాదేది కవితకు అనర్హం' అనే విధంగా అన్ని అంశాలపై కవిత్వాన్ని అందరికీ అర్థమయ్యే భాషలో రాయగలిగారన్నారు. ఆయన రచనలు సినిమా రంగంలో కూడా ప్రాచుర్యం పొందాయన్నారు. ఆయన కవిత్వం ప్రతి మనిషీ, ప్రతి వస్తువూ, ప్రతి ప్రాంతం, దేశం దాటి విహరించిందని అన్నారు. దోపిడీ వ్యవస్థను చీల్చి చెండాడిందని తెలిపారు. వలసదారులు, రాళ్లు ఎత్తిన కూలీలు, వృద్ధులు, విద్యార్థులు, యువకులు, మహిళలు ఇలా అన్ని తరగతుల ప్రజలపైనే కాకుండా అగ్గిపుల్ల, సబ్బు బిల్ల, కుక్కపిల్ల ఇలా మనిషి జీవితంలో ప్రతి అంశాన్ని, అంకాన్ని తడిమింది శ్రీశ్రీ రచన అన్నారు. ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం.. నరజాతి సమస్తము పర పీడన పరాయణత్వం అని ఆయన రాసిన కవిత్వం సమాజ గమనాన్ని అద్దంలో చూపిందన్నారు. పుస్తక ప్రియులు చెరుకువాడ వెంకటరామయ్య, చాంద్‌భాషా మాట్లాడుతూ శ్రీశ్రీని కలిసిన సందర్భంలో ఉత్సాహం ఉరకలేసిందని గుర్తు చేశారు. ఆయన ఉపన్యాసాలు వింటుంటే ఎంతవిన్నా ఇంకా వినాలన్పించేలా ఉండేవన్నారు. శ్రీశ్రీ మహాప్రస్థానం పుస్తకం 37వ ప్రింట్‌ను చదువుతుంటే చాలా ఉత్సాహం కలుగుతుందన్నారు. దానిలో చలం రాసిన యోగ్యతా పత్రం తప్పకుండా చదవాల్సిన అంశమని అన్నారు.
తదనంతరం మహాప్రస్థానం పుస్తకాన్ని అందులోని కవితలను సభికులందరూ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ ఆనందరావు, ప్రముఖులు బి.బలరాం, రంగా, వాసుదేవరావు, వైకుంఠరావు, కళ్యాణి, షేక్ వలీ, రాధాకృష్ణ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఘనంగా రెడ్‌బుక్ డే

వీరవాసరం: సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో యుటిఎఫ్ కార్యాలయంలో శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం పుస్తకాన్ని అధ్యయనం చేశారు. కేతా జ్యోతిబసు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. దేశంలో బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విషప్రచారాలను తిప్పి కొట్టాలంటే అందరు మంచి పుస్తకాలను చదవాలన్నారు. కార్యక్రమంలో బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, రెడ్డి రామారావు, యాళ్లబండి నారాయణమూర్తి, తాళ్లూరి రాము, పాలా కోటేశ్వరరావు, అయినంపూడి బాబూరావు పాల్గొన్నారు.

తణుకు: మాట్లాడుతున్న డివివిఎస్ వర్మ

పెంటపాడు: ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లోని ఉల్లిపాయలు మార్కెట్ ఆఫీసులో రెడ్‌బుక్ డే సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానంలో సారాంశాన్ని వివరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, అల్లు సుబ్బారావు, కర్రి సాయిరెడ్డి, తేతల నాగిరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

ఆచంట: సమసమాజ స్థాపన కోసం విద్యార్థులు, యువత శాస్త్రీయ విజ్ఞానాన్ని అధ్యయనం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎస్.శర్మ అన్నారు. స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెడ్‌బుక్ డే నిర్వహించారు. శ్రీశ్రీ మహాప్రస్థానంను విద్యార్థులతో కలిసి అధ్యయనం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రాయపల్లి మధుకిరణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తమరాపు దుర్గాప్రసాద్, సాహితీ స్రవంతి నేతలు పి.మోహనరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: రెడ్‌బుక్ డేను రూరల్ మండలం ఇటుకలగుంట నిర్వహించారు. ముఖ్యవక్తగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు స్వాతంత్రోద్యమ కాలంలో విప్లవ కవి శ్రీశ్రీ అందించిన మహాప్రస్థానం రచనలు యువతను మేలుకొల్పాయన్నారు. కార్యక్రమంలో నేతలు కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యవతి, గోపాల వెంకట్రావు, కండెల్లి రమేష్‌బాబు, మాగంటి రమణలక్ష్మి, మల్లిపూడి సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

పాలకొల్లు: రెడ్‌బుక్ డేను స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనుకుపోయిన సామాజిక రుగ్మతలను రూపుమాపడం కోసం రెడ్‌బుక్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, దొండపాటి రోజామణి, ఏలూరి సీతామహాలక్ష్మీ, జె.లక్ష్మీ, కె.బాలరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్: పుస్తకాలే ప్రపంచ చరిత్రను మార్చిన సంగతి మరువరాదని దారిదీపం సంపాదకులు డివివిఎస్.వర్మ అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో రెడ్‌బుక్ డే వర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్‌చంద్రబాబు, కవిశ్రీ మోహన్‌ప్రసాద్, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, రిటైర్డ్ ప్రిన్సిపల్ సంకు మనోరమ, శ్రామిక మహిళా కన్వీనర్ అడ్డగర్ల అజయకుమారి, డి.సీతారామయ్య మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం చాలామంది జీవితాలను ప్రభావితం చేశాయన్నారు. ఈ ప్రపంచం ఉన్నంత వరకూ శ్రీశ్రీ కవిత్వం ఉంటుందని తెలిపారు. అనంతరం మహాప్రస్థానంలోని కవితలు చదివారు.

పాలకోడేరు: మండల కేంద్రమైన పాలకోడేరులో రెడ్‌బుక్ డేను సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. సిపిఎం నాయకురాలు దున్న మేరీ అధ్యక్షత వహించారు. సీనియర్ నాయకులు తాడి రామారావు శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం పుస్తకాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అసిరియ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, దుర్గ పాల్గొన్నారు.


పెంటపాడు : మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

సీలేరు నుంచి సాగునీరు : కలెక్టర్

ప్రజాశక్తి - ఆకివీడు

సాగునీటికి రైతులకు సమస్య లేకుండా సీలేరు నుండి త్వరలో పూర్తిస్థాయిలో నీళ్లు రానున్నాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. మంగళవారం ఆమె మండలంలోని గుమ్ములూరులో పంట పొలాలను పరిశీలించారు. వంతులవారీ విధానంలో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్‌బికె సిబ్బంది రైతుల వద్దకు వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాసరావు, ఎఒ ప్రియాంక, తహశీల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుమ్ములూరులో పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇ-క్రాప్ నమోదుతో పలు ప్రయోజనాలు

కాళ్ల: ఇ-క్రాప్ పంట నమోదు వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో దాళ్వా వరిసాగుకు సంబంధించి ఇ-క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. 2023 దాళ్వాసాగుకు సంబంధించి ఇ-క్రాప్ నమోదులో భాగంగా రైతు వెలివెల రాంబాబు 59/1 సర్వే నెంబర్‌లో సాగు చేసిన వరి పైరును కలెక్టర్ పరిశీలించారు. పంట నమోదు వివరాలు, విస్తీర్ణం, పంట పేరు, నాటిన తేదీ, పంట రకం, నీటి సాగు పద్ధతిపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతులకు అందే సంక్షేమ పథకాలన్నీ ఇ-పంటపై ఆధారపడి ఉంటాయన్నారు. పంట నష్ట పరిహారం, బీమా, వడ్డీలేని పంట రుణాలు, ధాన్యం కొనుగోలు మొదలగునవి ఇ -పంట ద్వారా అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఆకివీడు ఎడిఎ కెఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ టిఎ.కృష్ణారావు, ఆర్ఐ కలిదిండి రాఘవరాజు, వ్యవసాయాధికారి సిహెచ్.జయవాసుకి తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ఇ-క్రాప్ నమోదును వేగంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వ్యవసాయ శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలో కలసిపూడిలో ఇ-క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదు, ఇకెవైసి ఈ నెల 25వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. పంట నమోదులో తప్పులున్న పక్షంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌బికె సిబ్బందితో సమావేశం నిర్వహించి వారాబందీ ఏవిధంగా అమలు చేస్తున్నారు, ఏఏ గ్రామాలకు ఏ రోజున ఎన్ని గంటలు నీరు విడుదల చేస్తున్నారు తదితర వివరాలు సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్. వెంకటేశ్వరరావు, సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాసరావు, తహశీల్దార్ ఎం.రవీంద్రకుమార్, ఎంపిడిఒ అడబాల వెంకట అప్పారావు, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, ఆర్ఐ వి.ఆంజనేయులు, విఆర్ఒ బి.సాల్మన్‌రాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు జి.లీలాకిషోర్, రైతులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

చింతపండు, అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ల వార్షికోత్సవాల్లో నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం పెంటపాడు మండల కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి విమర్శించారు. చింతపండు మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 30వ వార్షికోత్సవం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో రోకళ్ల లోవరాజు అధ్యక్షతన జరిగింది. యూనియన్ సీనియర్ నాయకులు నీరుకొండ లక్ష్మీ నారాయణ పతాకాన్ని ఆవిష్కరించారు. 2022 కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కార్యదర్శి తంగేటి శ్రీనివాస్ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు, సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో రైతులు, కార్మికులు, ప్రజలపై దాడులు విపరీతంగా పెరిగాయన్నారు. బడ్జెట్లో అసంఘటిత రంగ కార్మికులకు ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుతున్నారన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వారికి కనీసవేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాడ్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించడం దుర్మార్గమని తెలిపారు. జాతీయవాదం పేరుతో అదాని మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఏప్రిల్ 5వ తేదీన రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు చేపట్టిన నిరసన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నరమాల కృష్ణ, ఉపాధ్యక్షునిగా శిరపు కృష్ణ, కార్యదర్శిగా పండూరి శ్రీను, జాయింట్ కార్యదర్శిగా వారా సురేష్, కమిటీ సభ్యులుగా యలమంచిలి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, గొర్రెల సతీష్, మెట్రెడ్డి రమణ, కుంచంగి నానాజీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కర్రి నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం : యార్డు అపరాల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 32వ వార్షికోత్సవం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మేత్రేటి రమణ అధ్యక్షతన జరిగింది. యూనియన్ సీనియర్ నాయకులు మేత్రేటి రమణ పతాకాన్ని ఆవిష్కరించారు. 2022 కార్యకలాపాల రిపోర్టును యూనియన్ కార్యదర్శి దేశంశెట్టి సతీష్ ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు రిపోర్టును ఆమోదించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం పెంటపాడు మండలం కన్వీనర్ చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చిందన్నారు. ఇది దుర్మార్గమని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మేత్రేటి రమణ, ఉపాధ్యక్షులుగా పోలా చంద్రశేఖర్, కార్యదర్శిగా దేశంశెట్టి సతీష్, జాయింట్ కార్యదర్శిగా కర్రి వెంకటరెడ్డి, కమిటీ సభ్యులుగా బుట్టా మూర్తి, కొమ్మిరెడ్డి ఉదయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, మడకా రాజు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, సత్తి కోదండరామిరెడ్డి, చల్లా చంద్రరావు, గొర్రెల సతీష్, మెట్రేటి రమణ, కుంచంగి నానాజీ పాల్గొన్నారు.

ఇఎస్ఐలో సమస్యలు పరిష్కరించాలని

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - తణుకురూరల్

కార్మికుల ఓట్లు కావాలి గాని, ఇఎస్ఐలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోరా అని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ విమర్శించారు. మంగళవారం స్థానిక ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద సిఐటియు, పలు పరిశ్రమల కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. అనంతరం ఇఎస్ఐ అధికారులకు, తహశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులు, చిన్న ఉద్యోగుల పట్ల అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. 15 రోజులుగా ఇఎస్ఐ ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా దున్నపోతు మీద వర్షం పడ్డ చందంగా ఉండడం బాధాకరమన్నారు. తణుకు పట్టణంలో వేలాది మంది కార్మికులు ఉన్నప్పటికీ 30 పడకల ఆసుపత్రి లేకపోవడం ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన లేకపోవడం కారణం అన్నారు. ఇఎస్ఐ ప్రారంభ సమయం కార్మికులకు ఉపయోగపడటం లేదని, కరోనాకు ముందు ఉన్న వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐలో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. నాయకులు కె.శ్రీనివాస్, పి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇఎస్ఐ కార్మికుల కోసం పెట్టినప్పటికీ పేరు గొప్ప ఊరు దిబ్బగా మారిందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎన్.ఆదినారాయణ బాబు, గుబ్బల గోపి, టి.రామకృష్ణ, పిఎస్.గాంధీ, జె.శ్రీనివాస్‌రాజు, జి.త్రిమూర్తులు, సురేష్, నాగేశ్వరరావు, కేశవ పాల్గొన్నారు.

ఇఎస్ఐ ఆసుపత్రి వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

టిడిపి కార్యాలయంపై దాడికి నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

గన్నవరంలో టిడిపి రాష్ట్ర కార్యాలయంపై దాడిని నిరసిస్తూ మండల టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ దాడి వైసిపి ఆధ్వర్యంలోనే జరిగిందంటూ ఆరోపిస్తూ వీరవాసరం తూర్పుచెరువు సెంటర్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న వారిని వీరవాసరం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వీరనారాయణ, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్, తెలుగు యువత మండల అధ్యక్షుడు పంపన సుధాకర్ పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం అభినందనీయం

పెనుమంట్ర:మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరవధిక సమ్మెను విజయవంతం చేసిన కార్మికులందరికీ సిఐటియు మండల కార్యదర్శి కోడే శ్రీనివాస్ ప్రసాద్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు జరిగిన చర్చలు సఫలమయ్యాయని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారం రోజుకు వేతనం రూ.46 పెంచేందుకు వైస్ ఛాన్సలర్ ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయకపోతే మరోసారి ఉద్యమిస్తామని తెలిపారు. సమ్మె చేపట్టిన సంస్థ యూనియన్ కార్యదర్శి ఐకేటి సుధాకర్, కమిటీ సభ్యులు నల్లిమిల్లి నాగరాజు, కె.శ్రీలక్ష్మి, డి.నాగరత్నం, పడాల నాగలక్ష్మి, జె.పరిమళ, పిల్లి అప్పలనర్సమ్మ, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు కూసంపూడి సుబ్బరాజు, కేత గోపాలన్ సంఘీభావం తెలిపారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌ను వినియోగించుకోవాలి

పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణ నిరంజని

పాలకోడేరు:ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి స్వర్ణ నిరంజని తెలిపారు. పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి రంగం నాయుడు సూచనలతో గొరగనమూడి హెల్త్ క్లినిక్ సెంటర్ వద్ద మంగళవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్వర్ణ నిరంజని బిపి, షుగర్, తదితర సమస్యలతో వచ్చిన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అంతేకాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి ఆహార నియమాలు పాటించాలి తదితర విషయాలను గురించి వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శంకర్, చంద్రిరాణి, ఎంఎల్‌హెచ్‌పి రోమెలా, హెల్త్ అసిస్టెంట్ ఎం.విజయ ప్రసాద్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం వెంకట్రామన్నగూడెం పిహెచ్‌సి పరిధిలోని కడియద్ద గ్రామంలో నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, 104 డాక్టరు పవన్ వర్మ ఆధ్వర్యంలో 136 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పోషకాహారం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి బి.సత్యనారాయణరావు, క్లస్టర్ హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పి పిలి దివ్య, విజయ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులతోనే రుణాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

వ్యవసాయ శాఖ రైతులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు సరిగ్గా ఇస్తే బ్యాంకు ద్వారా రుణాలు పొందేందుకు అనుకూలంగా ఉంటుందని జిల్లా బ్యాంకర్స్ మేనేజర్ (ఎల్‌డిఎం) ఎంబివి రమణ అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జాయింట్ మండల స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశం పెనుమంట్ర కెనరా బ్యాంక్ మేనేజర్ బి.హరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రతి శాఖ ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందే విధంగా సహకరించాలన్నారు. ప్రతి బ్యాంకూ ఆయా శాఖల లబ్ధిదారుల నుండి లావాదేవీలు జరిగేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, ఎంపిడిఒ పూర్ణబాబ్జి, జిల్లా ప్రాజెక్ట్ అధికారి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో జనంలోకి జనసేన

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన నర్సాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. మంగళవారం సాయంత్రం మొగల్తూరు పంచాయతీ పరిధి అగ్రహారం సత్రపాలెం గ్రామాల్లో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం పాతకాలువ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, దూది బాబు, బొక్కా చంటి, దాసరి కృష్ణాజీ, వాతాడి కనకరాజు పాల్గొన్నారు.

అన్నాక్యాంటీన్ వద్ద అన్నదానం

తాడేపల్లిగూడెం:అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణలో రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. మంగళవారం పట్టణ తాలుకాఫీస్ సెంటర్లోని అన్నా క్యాంటీన్ వద్ద అలంపురం మాజీ సొసైటీ అధ్యక్షుడు అప్పసాని రవి కుమార్ ఆర్థిక సాయంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ ఐదు రూపాయలకే భోజనం పెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్ పాల్గొన్నారు.

రామేశ్వరస్వామికి రూ.5.06 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

నత్తారామేశ్వరంలోని రామేశ్వరస్వామి వారి హుండీ లెక్కించినట్లు ఆలయ ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి వై.శ్రీధర్ అన్నారు. మంగళవారం కొఠాలపర్రు దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.జానకీరామరాజు ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా దేవస్థానానికి రూ.5 లక్షల 6 వేల 448 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెలగల ధర్మారెడ్డి, ఉప సర్పంచి కిరణ్ కుమార్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

మొగల్తూరు:అమృత్ సరోవర్ పథకంలో చేపట్టిన చెరువుగట్టు ప్రక్షాళనలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్‌కుమార్ సూచించారు. మొగల్తూరులోని నిర్వహిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ జవ్వాది వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ గుడాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల అండ

పాలకోడేరు :స్నేహితుడి మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అతని కుటుంబానికి పూర్వ విద్యార్థులంతా అండగా నిలిచారు. శృంగవృక్షం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 1992-1997లో చదువుకున్న విద్యార్థుల్లో ఒకరైన ఐసెట్టి నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నాగరాజు మృతితో ఒంటరైన అతని తల్లి సత్యవతి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న పూర్వ విద్యార్థులంతా మంగళవారం ఆమెకు రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సవరం సత్యకృష్ణ, పంపన నాగేశ్వరరావు, ఖండవల్లి సతీష్, పిట్లా యేసు, గరికిపాటి నాగరాజు, విజయనంద్, చింతా విజయకుమార్ పాల్గొన్నారు.

స్నేహితుని తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మధురమైంది మాతృభాష



పోడూరు: విద్యార్థులకు అందజేసిన ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - పోడూరు

మాతృభాష ద్వారా పరిపూర్ణ విషయ పరిజ్ఞానం పొందుతామని ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మంగళవారం గుమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్య కుమార్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లవ్ పీపుల్ ఫౌండేషన్ (ఎల్‌పిఎఫ్) వారు పాఠశాల విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి పోతాబత్తుల లక్ష్మీ దుర్గ మాతృభాషపై మమకారం కలిగి ఉండాలన్నారు. లవ్ పీపుల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఉన్నమట్ల ప్రేమ్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని పీటర్సన్ శాంతాగ్రేస్, ఎస్‌ఎంసి ఛైర్మన్ చింత పద్మ, ఎల్‌పిఎఫ్ ఆచంట నియోజకవర్గం ఇన్‌ఛార్జి రావి హరీష్ బాబు పాల్గొన్నారు.

పాలకొల్లు:పట్టణంలోని ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించగా, తెలుగు విభాగాధిపతి బి. సుబ్బలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు. సభాధ్యక్షులు మాట్లాడుతూ మానవ మనుగడ మాతృభాషల సక్రమ వినియోగంలోనే ఉందన్నారు. తెలుగు విభాగాధిపతి మాట్లాడుతూ తెలుగును ప్రేమించడం అంటే తల్లిని, నేలను, ప్రకృతిని ప్రేమించడమేనని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్, రామకృష్ణ, కె.శిరీష పాల్గొన్నారు.

తణుకురూరల్: మరుగున పడుతున్న తెలుగు భాషను, కనుమరుగవుతున్న సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు అన్నారు. సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో రూట్స్ స్కూల్లో మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాడినా భాస్కరావు, పివి సత్యనారాయణరాజు మాట్లాడారు. కమ్మనైన అమ్మ భాషను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భమిడి లక్ష్మణశర్మ, వాడపల్లి విశ్వేశ్వరరావు, రూట్స్ స్కూల్ ప్రిన్సిపల్ ఎల్‌కె.త్రిపాఠి, బి.విద్యాకాంత్, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ పాఠశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఏకపాత్రాభినయంతో పాటు వ్యాసరచన, తెలుగులో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వసంతలక్ష్మి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిగమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు షేక్ పీర్ సాహెబ్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ మేరకు తెలుగు భాషోపాధ్యాయుడు గొల్లమందల రాజ్జును సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వలవల రాజేశ్వరి, సిహెచ్.వీరాస్వామి, పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆకివీడు : తెలుగు భాష ఎంతో పురాతనమైందని, భాషలన్నింటిలోకి తీయనైన భాష తెలుగు భాష అని దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.ఆనంద్ అన్నారు. మాతృభాషా దినోత్సవం కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ఆనంద అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఎంఎల్‌ఎ సాయం

ప్రజాశక్తి - వీరవాసరం



బాలేపల్లిలో దగ్ధమైన ఇళ్లను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

బాలేపల్లిలో అగ్నిప్రమాద బాధితులను ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మూడు తాటాకిళ్ళు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.నాలుగు లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఆ ఇళ్లల్లోని వారు రాత్రి తాళాలు వేసి దేవాలయానికి వెళ్లిన తరువాత గ్యాస్ లీకై ప్రమాదం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ సమయంలో ఇళ్లల్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బాధిత కుటుంబాలైన పడవల సత్యనారాయణ, పడవల దాసు, పొలమూరు నాగరత్నంకు ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు పక్కా ఇళ్లు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌ఎ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, సర్పంచులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, చికిలే మంగతాయారు, ఉపసర్పంచి కాటిక విజయనిర్మల ఉన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పట్టణాభివృద్ధి, సుంద్రీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. భీమవరం పట్టణాభివృద్ధి, సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మన ఊరు- మన భీమవరం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షత వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్, ఛారిటబుల్ ట్రస్టులు సిహెచ్ కృష్ణంరాజు, ఆక్వా పరిశ్రమ పారిశ్రామిక వేత్తలు, పట్టణంలోని ప్రముఖ డాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిల్డర్లు, విద్యా సంస్థ అధినేతలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్కులు, రోడ్ల డెవలప్మెంట్లు, శానిటేషన్ నిర్వహణ, అంబేద్కర్ చౌక్ అభివృద్ధి, గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్, కార్ పార్కింగ్, కెనాల్ బండ్ వంటివి అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పట్టణ సుంద్రీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ప్రశ్నిస్తే దాడులు చేస్తారా

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధినేత చంద్రబాబుకు వస్తున్న ప్రజాధారణ చూసి వైసిపిలో వణుకు ప్రారంభమైందని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేశ్ పర్యటనలను అడ్డుకునేందుకు ప్రభుత్వ పోలీసులచే కుట్ర పన్నుతోందన్నారు. వైసిపి ఎంఎల్‌ఎల అరాచకాలపై ప్రశ్నించడం తప్పా అని, అరాచకాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని ప్రశ్నించారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై వైసిపి గూండాల దాడిని ఖండిస్తున్నామని, టిడిపి కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్న విషయం జగన్ గుర్తుంచుకోవాలని తెలిపారు.

నరసాపురం : అరాచక పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నిస్తే బిసిలపై దాడులు చేస్తున్నారని టిడిపి సీనియర్ నాయకుడు కొవ్వలి రామ్మోహన్ నాయుడు, పార్టీ ఇన్‌ఛార్జి పొత్తూరు రామరాజు విమర్శించారు. బియ్యపుతిప్పలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడు, రామరాజు పాల్గొని ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాక్షసత్వంతో చేస్తున్న విషయం నిన్న గన్నవరంలో మరోసారి బట్టబయలైందన్నారు. కళంకిత పోలీసులు, అధికారులు దగ్గరుండి టిడిపి కార్యాలయంపై దాడి చేయించారని విమర్శించారు. గన్నవరం టిడిపి కార్యాలయంపై వంశీ తన అనుచరులు, రౌడీ మూకలతో విచక్షణ రహితంగా దాడి చేయించి మారణ హోమం సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నరసాపురం మండల అధ్యక్షులు వాతాడ ఉమామహేశ్వరరావు, అందే రామకృష్ణ, శంకరపు వెంకటేశులు, రాధాకృష్ణ, నరసింహస్వామి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు రూరల్ ప్రాంతంలోని సబ్బేవారిపేటలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పాముల రజిని కుమార్ పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారని, డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శించారు. త్వరలోనే సైకో పాలన పోయి సైకిల్ పాలన వస్తుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో దొడ్డ శ్రీనివాస్, దిండి లక్ష్మణరావు, కొండేటి సూర్యనారాయణ రాజు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ వైద్య శిబిరాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం నియోజకవర్గంలో కొవ్వలి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఆక్యుపంక్చర్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం వేములదీవి గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని రామ్మోహన్ నాయుడు ప్రారంభించి మాట్లాడారు. పురాతన ఆక్యుపంక్చర్ వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అన్ని రకాల వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పులను ఆక్యుపంక్చర్ వైద్యంతో తగ్గించుకోవచ్చన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు వాతాడి ఉమా మహేశ్వరరావు, మాజీ ఎంపిటిసి మైలా వసంతరావు మాట్లాడుతూ తీరప్రాంత ప్రజలకు ఆక్యుపంక్చర్ వైద్యాన్ని పరిచయం చేసి దీర్ఘకాలిక వ్యాధులు, నొప్పులతో ఇబ్బంది పడుతున్న వారికి వైద్య సేవలందిస్తున్న కొవ్వలి ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో ఉంగరాల నాగరాజు, ఉంగరాల గిరివాసు, ఏడుకొండలు, ఘంటసాల వేణు, నంద్యాల ప్రసాద్, శంకు భాస్కర నాయుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - పెనుగొండ

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం రామన్నపాలెం రెండో రోజు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గోవర్ధన్, సర్పంచి ఎర్రంశెట్టి బుజ్జి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సర్రాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైసిపి నేతలు

సర్రాజుకు వైసిపి నేతల నివాళి

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలోని పలువురు వైసిపి నాయకులు పాతపాటి సర్రాజు కుమారులను, భార్యను మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయనకు నివాళులర్పించి, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వేగేశ్న వెంకటరాజు (ఎండగండి శీను), నగర పంచాయతీ ఛైర్ పర్సన్ జామి హైమావతి, నాయకులు నంద్యాల సీతారామయ్య, గుండా సుందర రామనాయుడు, పి.సత్యనారాయణ, జగురోతి విజయ్, వై.ధనరాజు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలల ఎత్తివేత నిర్ణయం సరికాదు

ప్రజాశక్తి - తణుకురూరల్

గ్రామీణ ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయాలనుకోవడం సమంజసం కాదని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 1, 2 తరగతులు మాత్రమే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల నుండి ఒక ఉపాధ్యాయుడిని ఉన్నత పాఠశాలల్లోకి డిప్యూటేషన్‌పై పంపడం వల్ల, ప్రాథమిక పాఠశాలల్లో ఒక ఉపాధ్యాయుడు కొనసాగడం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలలుగా రూపాంతరం చెందాయని విమర్శించారు. ఈ పాఠశాలల్లో 10లోపు విద్యార్థులుంటే వాటిని సమీప ప్రాథమిక పాఠశాలల్లో విలీనం చేసి గ్రామీణ ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాలలను ఎత్తివేయాలని ప్రభుత్వం యోచిస్తోందని, ఇది సరికాదని తెలిపారు.

జిఒ.132, 680లను అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

గ్రామ పంచాయతీ కార్మికుల పోరాటం ఫలితంగా 132, 680 జిఒలను ప్రభుత్వం విడుదల చేసిందని, అయితే నేటికీ అవి అమలుకు నోచుకోలేదని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. మంగళవారం సిఐటియు కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం చింతా రాజారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2019లో కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలని కోరుతూ జిఒ 132ను గత ప్రభుత్వం జారీ చేసిందన్నారు. 2022 జనవరి 1 నుంచి నెలకు రూ.పది వేల జీతం చెల్లిస్తామంటూ జిఒ 680ను 2021 అక్టోబర్లో ప్రభుత్వం జారీ చేసిందన్నారు. ఈ రెండు జిఒలు కాగితాలికే పరిమితమయ్యాయే తప్ప నేటికీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులలో స్వీపర్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషన్లు, గ్రీన్ అంబాసిడర్లు వంటివారు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వీరి పట్ల చిన్న చూస్తోందని, తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు చింత రాజారెడ్డి, రాజబాబు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంతో ఆరోగ్యం : కలెక్టర్

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

ప్రజాశక్తి - కాళ్ల

రామకృష్ణ మిషన్, వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవల వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. పెదఅమిరంలో స్వామి వివేకానంద సేవా సమితి వద్ద రామకృష్ణ పరమహంస జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు వేగిరాజు శివ వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథి గృహాన్ని, స్టాఫ్ క్వార్టర్స్‌ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జీవనం యాంత్రికంగా మారిపోయిందన్నారు. ఉన్నత విద్యనభ్యసించినా, మంచి సంపాదన ఉన్నా రాత్రి నిద్రపోయే సమయానికి ఏదో వెలితి కనిపిస్తోందన్నారు. రామకృష్ణ మిషన్, వివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రశాంతమైన యానం చేసుకునేందుకు మంచి వాతావరణాన్ని కల్పించడం ఒక వరంలా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాతళ్లమెరక గ్రామ సర్పంచి కంతేటి ఉష, కంతేటి శ్రీనివాసరాజు, కంతేటి వెంకట్రాజు, వివేకానంద సేవా సమితి ప్రతినిధులు, పాల్గొన్నారు.

పాలకొల్లు అసెంబ్లీ సీటు బిసిలకివ్వాలి

శెట్టిబలిజ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాలకొల్లు

ముఖ్యమంత్రి జగన్ గోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉన్న శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని గుర్తించి రెండు ఎంఎల్‌సి పదవులు ఇవ్వడం బిసిలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత అని పలువురు శెట్టిబలిజ సంఘం నేతలు చెప్పారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో వైఎస్‌ఆర్ పితాని సత్యనారాయణకు శెట్టిబలిజ నుంచి మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం జగన్ శెట్టిబలిజ కులానికి అత్యధిక ప్రాధాన్యతిచ్చి మంత్రి పదవితో పాటు ప్రస్తుతం 11 ఎంఎల్‌సి సీట్లు బీసీలకు ఇవ్వగా దానిలో రెండు శెట్టిబలిజ సామాజిక వర్గానికి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లు ఎంఎల్‌ఎ బీసీలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో శెట్టిబలిజ నియోజకవర్గ నాయకులు కుక్కల శ్రీనివాస్, గుబ్బల వేణు, చిట్టూరి ఏడుకొండలు, వీరవల్లి దుర్గారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లలో శ్మశానవాటిక అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ పనుల్లో భాగంగా నిధులు మంజూరు చేయకపోవడంతో స్థానికులు కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఎపి డి విజయలక్ష్మి మంగళవారం కాళ్లలో విచారణ చేపట్టారు. ఎంపిడిఒ జి.స్వాతి ఉపాధి హామీ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది విచారణలో పాల్గొన్నారు. ప్రజా విరాళంగా చెల్లించిన రూ.3 లక్షల డీడీని ప్రభుత్వం నుంచి తిరిగి అందజేయాలని ఫిర్యాదారులు నాగభూషణం అధికారులకు విజ్ఞప్తి చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఎపి డి విజయలక్ష్మి ఫిర్యాదుదారులకు తెలిపారు.

వ్యవస్థాపక నైపుణ్యాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శశి ఇంజినీరింగ్ కళాశాల రెడ్ యాంట్ క్లబ్, ఇడిసిసెల్ ఆధ్వర్యంలో మంగళవారం 'వ్యవస్థాపక నైపుణ్యాలు' అంశంపై ఉంగుటూరు అర్ణవ్ పాలిమర్స్ అండ్ ఫిషరీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మనోజ్ కుమార్ సుంకర్ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యవస్థాపక ఆలోచనను రూపొందించడం, ఆలోచనను అమలు చేసే ప్రక్రియ, వ్యాపారాన్ని ప్రారంభించడానికి సవాళ్లకు సంబంధించిన విషయాలను వివరించారు. వ్యాపారాన్ని ప్రారంభించడానికి ఆసక్తిని ఎలా సృష్టించాలో తెలిపారు. ప్రభుత్వ సంస్థలు విద్యార్థులకు వ్యవస్థాపకులుగా మారడానికి అందించే పథకాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్, సైన్స్ విభాగాధిపతి పి.రామకృష్ణ, కోఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S. 630/2020
Between:
Canara Bank (e-Syndicate Bank), Tanuku, Rep. by its Manager -వాది
AND
1. Vathumilli Anvesh, S/o. Venkata Naga Raju, Permanent Resident of Tanuku, A.P.
2. Vathumilli Venkata Naga Raju, S/o. Pothu Raju, Tanuku, A.P. -ప్రతివాద్లు
వాదికి వసూలు కావలసియున్న బాకీ మొత్తము **రూ. 9,39,587-03 పైసలు** దర్మిలా వడ్డీ మరియు ఖర్చులు నిమిత్తము ప్రతివాద్లు పై దావా దాఖలు చేసియున్నారు. సదరు పై నెంబరు దావా, ప్రతివాద్లు 1 మరియు 2 హాజరు నిమిత్తము ది. 27-03-2023న వాయిదా అయి ఉన్నది. 1 మరియు 2 ప్రతివాద్లు **ది. 27-03-2023వ తేదీన** పైన తెల్పిన మహారాజశ్రీ కోర్టు వారి ఎదుట ఉదయం గం।। **10.30** ని।।ల లగాయితు స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ యొక్క ఆక్షేపణలు దాఖలు చేసుకోవలెను. ఇందుకు తప్పే యెడల పై నెంబరు దావా 1, 2 ప్రతివాద్లు యొక్క పరోక్షము నందు తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియచేయడమైనది. యీ ప్రకటన ది. 13-02-2023వ తేదీ గల కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ప్రకటించడమైనది.
సి.యస్.వి.యస్.బుస్సీ
తణుకు వాది తరపు న్యాయవాది
22-2-2023 తణుకు, సెల్:9989567750

In The Court Of The Principal Senior Civil Judge :: Eluru
E.P.No. 21/2020
O.S.No. 166/2017
Between:
Nekkanti Suryanarayana Murthy ...D.H.R
AND
1) Chodem Muthyam
2) Chodem Surya Paul Manohar
3) Chodem Surya Paul Anvesh ...J.D.R's
వేలం ప్రకటన
పై నెంబరు గల ఇ.పి.లో డిక్రీ బాకీ రాబట్టుకొనే నిమిత్తం జడ్జిమెంటు డెటారు /ప్రతివాది సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములో గల ఈ క్రింది ఇ.పి. షెడ్యూలు దాఖలా స్థిరాస్థిని **ది.14-03-2023వ తేదీన ఉదయం గం।।10:30 ని।।లకు** పై కోర్టు వారి ఎదుట **బహిరంగ వేలం వేయుదురు.** ఎవరైనాను వేలం పాటలో పాల్గొని స్థిరాస్థిని వేలంపాటలో పాడుకొనవచ్చును. షరతులు వర్తించును.
E.P.Schedule
An extent of 222 Square Yards of Site and a Terraced Building therein with bearing the D.No.3-62/1, wered by R.S.No.146/2 of Eluru (V), Peddapadu (M), W.G.District, Vatluru Sub Registrer within the following boundaries:
East: Joint Bazar.
South: Property of Matta Srinivasa Rao.
West: Property of RaniMekalaBadrachalam.
North: Property of Matta Nice Babu.
D.H.R. Value : Rs. 15,00,000/-
Amina Value : Rs. 18,32,000/-
NEKKARAGANTI NARASIMHA RAO
Eluru, Advocate, Ashok Nagar,
20-2-23. Eluru. Cell: 98481 18984

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: ఏలూరు
E.P.No. 37/2019
in O.S.No. 65/2016
బిట్వీన్:
వేమా సత్యనారాయణ మరియొకరు
...పిటీషనర్లు /డిక్రీ హోల్డర్స్
మరియు
పులి గోపాలరావు
...రెస్పాండెంటు /జడ్జిమెంటు డెటార్
పై నెంబరు డిక్రీ అమలు పిటీషను గ్రంథములో ఈ దిగువ షెడ్యూలు స్థిరాస్థిని, పై శ్రీకోర్టు వారి ఎదుట **ది.13-03-2023న ఉదయం గం।।10:30 ని।।లకు బహిరంగ వేలం ద్వారా అమ్మకం జరుపబడును.** సదరు వేలంలో పాల్గొనదలచినవారు సదరు తేదీన పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై పాడుకొనవచ్చును. పాట షరతులు వగైరా విషయముల గురించి కోర్టు నజారత్ వారిని సంప్రదించగలరు.
వేలపు షెడ్యూలు ఆస్తి వివరం
In West Godavari District, Eluru Sub-di, Eluru Mandal, Jalipudi Panchayat, Jalipudi Village, R.S.No. 281, Zirayathi wet land admeasuring Ac.0-92 Cents Bounded by:
East: Land Of Kola Prasad.
South: Land Of Surat Rama Rao.
West: Land Of Pydipati Rama Krishna.
North: Land Of Bandi Srinivas.
డిక్రీ హోల్డర్ విలువ : రూ.18,20,000/-
అమీనా విలువ : రూ.23,92,000/-
గమనిక: వేలంలో పాల్గొనదలచిన పాటదారులు పై వేలపు తేదీన వారియొక్క ఆధార్ కార్డుతో హాజరై వారి యొక్క అఫిడవిట్ దాఖలు చేయవలయును. వేలం ముగిసిన వెంటనే Highest Bidder తను పాడిన మొత్తంలో 1/4వ వంతు సొమ్ము శ్రీవారి కోర్టులో డిపాజిట్ చేయవలయును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)
కోరుకొండ రాజారామమోహన్
జి.వి.రమణమూర్తి
డిక్రీ హోల్డర్స్ తరపున న్యాయవాదులు,
అగ్రహారం, ఏలూరు-534001.